


భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది నేనే. యుద్ధాన్ని ఆపేందుకు మధ్యవర్తిత్వం వహించాలని ట్రంప్‌ను కోరాను. రిపబ్లికన్స్‌తో పాటు డెమోక్రాట్లనూ కలిసి మాట్లాడాను. మన దేశాధినేతలతోపాటు పాక్ నాయకులతోనూ తాను టచ్‌లో ఉన్నాను. మొత్తానికి మనందరం శుభవార్త విన్నాం.

-కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు

# కాల్పుల విరమణ

## భారత్, పాక్ మధ్య కుదిరిన ఒప్పందం • మధ్యవర్తిత్వం వహించినట్టు ట్రంప్ ప్రకటన

- భారత డీజీఎంవోకు పాక్ డీజీఎంవో ఫోన్
- కాల్పుల విరమణకు ప్రతిపాదన.. అంగీకరించిన భారత్
- సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి కాల్పుల విరమణ ఒప్పందం
- రేపు మధ్యాహ్నం 12 గంటలకు భారత్-పాకిస్థాన్ డీజీఎంవోల చర్చలు
- పాక్‌పై ఇతర ఆంక్షలు కొనసాగింపు
- ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్రంగా స్పందిస్తామని ఆర్మీ హెచ్చరిక



ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన కీలక సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, జైశంకర్

*కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందిలా..*

*మధ్యాహ్నం 3:30 గంటలకు:* భారత 'డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్' (డీజీఎంవో)కు పాకిస్థాన్ డీజీఎంవో ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ప్రతిపాదించారు.

*సాయంత్రం 4:30 గంటలకు:* కాల్పుల విరమణను అమలు చేస్తున్నట్టు పాకిస్థాన్ ప్రకటించింది.

*సాయంత్రం 5 గంటలకు:* కాల్పుల విరమణను అమలు చేస్తున్నట్టు భారత్ ప్రకటించింది.

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలతో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం కొంత తేలికపడింది. కాల్పుల విరమణకు పాకిస్థాన్ ప్రతిపాదించగా భారత్ అంగీకరించింది. పూర్తిస్థాయిలో, తక్షణ కాల్పుల విరమణకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తమ మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం కుదిరినట్టు చెప్పారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చిందని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఒప్పందం అనంతరం ఆయన శనివారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. 'పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ప్రతిపాదించారు. అనంతరం భూతల, గగనతల, సముద్రతలాల్లో కాల్పుల విరమణకు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. సాయంత్రం 5 గంటల నుంచే తక్షణం, పూర్తిస్థాయిలో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది' అని ప్రకటించారు. ఒప్పందం అమలుపై ఇరువైపులా సైన్యానికి తగిన ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. తదుపరి కార్యాచరణ కోసం రెండు దేశాల డీజీఎంవోలు ఈ నెల 12న మరోసారి సమావేశం కానున్నట్టు తెలిపారు. మరోవైపు సాయంత్రం 4:30 గంటల నుంచి తమ దేశంలో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తెలిపారు.


### మోదీ అత్యున్నత సమావేశం

కాల్పుల విరమణ ప్రకటన అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం సాయంత్రం అత్యున్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి జరిగిన పరిణామాలను ప్రధానికి వివరించారని, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారని సమాచారం.

### ఆంక్షలు కొనసాగుతాయి..

కాల్పుల విరమణకు మాత్రమే భారత్ అంగీకరించిందని, ఇతర ఆంక్షలు కొనసాగుతాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పహల్గాం దాడి తర్వాత పాక్‌తో నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతోపాటు వ్యాపార, వాణిజ్య సంబంధాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్టు భారత ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఆంక్షలన్నీ కొనసాగుతాయని కేంద్ర వర్గాలు స్పష్టం చేశాయి.

### ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తప్పవు: భారత ఆర్మీ



పాకిస్థాన్ ఇకపై ఒప్పందాలు ఉల్లంఘించి ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా తీవ్ర స్థాయిలో ప్రతిస్పందిస్తామని భారత ఆర్మీ ఘాటుగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటన అనంతరం ఆర్మీ స్పందించింది. 'ఈ రోజు కుదిరిన అవగాహన ఒప్పందానికి మేం కట్టుబడి ఉన్నాం. అయితే భారత సార్వభౌమత్వాన్ని రక్షించుకునేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాం. దేశ రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టేందుకైనా మేం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాం' అని ఆర్మీ కమాండర్ రఘు నాయర్ తెలిపారు. భవిష్యత్తులో పాక్ చేసే ప్రతి ఉల్లంఘనకు అంతకన్నా బలంగా ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు.

### ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుంది

కాల్పుల విరమణపై విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్పందించారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం కొనసాగుతుందన్నారు. 'కాల్పుల విరమణ, సైనిక చర్య నిలిపివేతపై భారత్, పాకిస్థాన్ మధ్య ఈ రోజు ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఉగ్రవాదం అన్ని రూపాలపై, భావాలపై భారత్ రాజీలేని పోరాటం కొనసాగించింది. ఇకపైనా కొనసాగుతుంది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

### అమెరికాకు పాక్ ప్రధాని ధన్యవాదాలు

కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ అమెరికా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. 'ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేసిన ట్రంప్ నాయకత్వానికి ధన్యవాదాలు. ఈ ప్రాంతంలో శాంతిని, సుస్థిరతను నెలకొల్పేందుకే ఈ ఒప్పందానికి అంగీకరించాం. ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారంలో ఈ ఒప్పందం కొత్త ఆరంభాన్ని సూచిస్తుందని బలంగా విశ్వసిస్తున్నాం' అని పోస్ట్ చేశారు. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్పందిస్తూ.. పాకిస్థాన్ శాంతికాముక దేశమని, తనను తాను కాపాడుకోవడం ఎలాగో తెలుసని తెలిపారు.

### కాల్పుల విరమణకు అంగీకరించాం: ఇషాక్ దార్

కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్టు పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ ధ్రువీకరించారు. 'తక్షణం కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయి. సాయంత్రం 4:30 గంటల నుంచి పాకిస్థాన్ కాల్పుల విరమణ పాటించేలా ఒప్పుకున్నాం. పాకిస్థాన్‌లో శాంతి, రక్షణ, సమగ్రత, సార్వభౌమాధికారం విషయంలో రాజీపడబోము' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అమెరికాతోపాటు బ్రిటన్, టర్కీ రాయబారులు ఈ ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించినట్టు చెప్పారు.


### గగనతలాలను తెరిచిన పాక్

కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పాక్ గగనతలంలో విమానాల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్టు పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (పీపీఏ) ప్రకటించింది.

### పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటుచేయాలి

అమెరికా మధ్యవర్తిత్వంతో భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణకు అంగీకరించటంపై విపక్షాలు పలు ప్రశ్నలు లేవనెత్తాయి. అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి రాజకీయ పార్టీలన్నింటికీ జరిగిన పరిణామలను వివరించాలని, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటుచేయాలని కాంగ్రెస్, ఎన్సీపీ(శరద్‌పవార్), ఆర్జేడీ సహా విపక్ష పార్టీలు కేంద్రాన్ని కోరాయి. కాల్పుల విరమణలో అమెరికా పాత్రను సీపీఐ, సీపీఎం ప్రశ్నించాయి. రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకొని అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ అన్నారు.

### మా మధ్యవర్తిత్వం ఫలితమే: ట్రంప్



**భారత్,** పాకిస్థాన్‌తో జరిపిన సుదీర్ఘ చర్చలు ఫలించాయని, రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'అమెరికా మధ్యవర్తిత్వంతో అర్ధరాత్రి వరకు జరిగిన చర్చల ఫలితంగా భారత్, పాకిస్థాన్ మధ్య పూర్తిస్థాయిలో, తక్షణం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. ఇంగిత జ్ఞానం, గొప్ప తెలివితేటలు ఉపయోగించినందుకు రెండు దేశాలకు అభినందనలు' అని ట్రంప్ పోస్ట్ చేశారు.

### రెండు రోజులపాటు శ్రమించాం: రూబియో



**భారత్,** పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడానికి తాను, ఉపాధ్యక్షుడు వాన్స్ కలిసి 48 గంటలపాటు శ్రమించామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో తెలిపారు. శాంతి మార్గాన్ని ఎంచుకోవడంలో భారత ప్రధాని మోదీ, పాక్ ప్రధాని షెహబాజ్ ప్రదర్శించిన రాజనీతిజ్ఞతకు, వివేకానికి ఈ ఒప్పందం ఒక నిదర్శనమని ప్రశంసించారు. 'నేను, వాన్స్ గత 48 గంటలుగా భారత్, పాకిస్థాన్ ప్రధాన మంత్రులు, విదేశాంగ శాఖ మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారులు, ఆర్మీ ఉన్నతాధికారులతో తీరిక లేకుండా చర్చలు జరిపాం. ఫలితంగా భారత్, పాక్ కాల్పుల విరమణకు ముందుకొచ్చాయి. తటస్థ వేదికపై చర్చలకు అంగీకరించాయి' అని అన్నారు.



శనివారం కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత శ్రీనగర్ గగనతలంలో పాక్ డ్రోన్‌లు

# పాక్ ఉల్లంఘన

- ఒప్పందం కుదిరిన గంటల్లోనే కాల్పుల విరమణకు పాక్ తూట్లు
- మూడు రాష్ట్రాల్లో డ్రోన్ దాడులు
- శ్రీనగర్, బారాముల్లా, జమ్ము తదితర నగరాలపై అటాక్
- గత 3 రోజుల్లో అతిపెద్ద డ్రోన్ దాడి!
- సమర్థంగా తిప్పికొట్టిన భారత సైన్యం
- సరిహద్దు ప్రాంతాల్లో పూర్తి బ్లాకౌట్
- కాల్పుల విరమణ ఎక్కడుంది?: ఒమర్

జమ్ము, మే 10: కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్ అంగీకరించిన కొన్ని గంటల్లోనే అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంబడి పాకిస్థాన్ ఒప్పంద ఉల్లంఘనకు తెగబడింది. జమ్ము కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లోని అనేక నగరాలపై డ్రోన్ల దాడి కొనసాగింది. కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలు ఎక్కడైనా జరిగితే పూర్తి స్థాయిలో ఎదుర్కొనాలని బీఎస్ఎఫ్‌ను ప్రభుత్వం ఆదేశించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. శ్రీనగర్‌తో సహా జమ్ము కశ్మీర్‌లోని అనేక చోట్ల పేలుళ్లు సంభవించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. మూడు రోజుల్లో ఇదే అతిపెద్ద డ్రోన్ దాడిగా పేర్కొన్నాయి. కశ్మీర్‌లోని బారాముల్లాతోపాటు రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో పాకిస్థానీ డ్రోన్లను భారత భద్రతాదళాలు కూల్చివేశాయి. శ్రీనగర్‌తోపాటు రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో శనివారం రాత్రి విద్యుత్తు సరఫరాను పూర్తిగా నిలిపివేసి బ్లాకౌట్ విధించారు. అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అఖ్నూర్, రాజౌరీ, ఆర్ఎస్ పురా సెక్టార్లలో పాకిస్థాన్ సైన్యం భారీగా కాల్పులు జరిపింది. జమ్ముకు చెందిన పలన్‌వాలా సెక్టార్‌లో ఎల్‌ఓసీ వెంబడి కూడా పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడింది. బారాముల్లాలో భారత దళాలు ఓ డ్రోన్‌ను పేల్చివేశాయి. బారాముల్లాలోనే అనుమాస్పద మానవరహిత గగనతల వాహనాలు(యూఏవీలు) కనిపించాయి.

### సరిహద్దు ప్రాంతాల్లో బ్లాకౌట్

పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించిన నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో బ్లాకౌట్ విధించారు. బారాముల్లా, శ్రీనగర్‌లో బ్లాకౌట్ అమలుచేశారు. మాతా వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించే భక్తుల బేస్ క్యాంపు కాట్రాలో కూడా బ్లాకౌట్ అమలు చేశారు. పంజాబ్‌లోని జలంధర్, లూథియానాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరిన అధికారులు ముందు జాగ్రత్తగా బ్లాకౌవుట్ విధించారు. జమ్ము ప్రాంతంలోని సాంబా జిల్లాలో వైమానిక దాడులకు సంబంధించిన హెచ్చరిక సైరన్లు మోగాయి.

### నగ్రోటా మిలిటరీ బేస్‌పై కాల్పులు

నగ్రోటా మిలిటరీ స్టేషన్‌లో శనివారం రాత్రి కొందరు వ్యక్తులు చొరబడి కాల్పులు జరిపినట్టు భారత సైన్యం ప్రకటించింది. సెంట్రీ స్వల్పంగా గాయపడ్డారని తెలిపింది. చొరబడిన వ్యక్తుల కోసం గాలిస్తున్నట్టు పేర్కొంది.

### పేలుళ్ల శబ్దాలు వినిపించాయి: ఒమర్



భారత్‌తో కాల్పుల విరమణకు పాకిస్థాన్ అంగీకరించిన కొన్ని గంటల్లోనే శ్రీనగర్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయని జమ్ము కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఎల్‌ఓసీ వెంబడి కవ్వింపు కాల్పులకు పాకిస్థాన్ పాల్పడుతోందని ఆయన తెలిపారు. కాల్పుల విరమణకు ఏం జరిగింది? శ్రీనగర్‌వ్యాప్తంగా పేలుళ్లు వినపడుతున్నాయి' అని ఎక్స్ పోస్టులో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పేలుళ్ల శబ్దాలు వినిపిస్తుండగా శ్రీనగర్‌కు చెందిన వీడియోను కూడా షేర్ చేశారు. 'కాల్పుల విరమణ కాదు. శ్రీనగర్ మధ్యలో ఉన్న గగనతల రక్షణ యూనిట్లు ఇప్పుడే తెరుచుకున్నాయి' అని ఆయన పేర్కొన్నారు.


## కాల్పుల విరమణ ఉల్లంఘనపై దీటుగా జవాబిస్తాం

- ఒప్పందాన్ని ఉల్లంఘించడం సరికాదు
- పాక్ బాధ్యతగా వ్యవహరించాలి
- సైన్యానికి పూర్తి అధికారాలు ఇచ్చాం
- విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్రీ



ఢిల్లీ, మే 10: కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఉల్లంఘనలపై దీటుగా జవాబిస్తామని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. కాల్పుల విరమణను ఉల్లంఘించడాన్ని, మళ్లీ షెల్లింగ్‌ను ప్రారంభించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సైన్యానికి పూర్తి అధికారాలు ఇచ్చామని, సైన్యం సర్వసన్నద్ధంగా ఉందని తెలిపారు. పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) స్థాయిలో జరిగిన కాల్పుల విరమణ అవగాహనా ఒప్పందాన్ని పాక్ పదేపదే ఉల్లంఘిస్తున్నది. గత కొన్ని గంటలుగా అంతర్జాతీయ సరిహద్దుతో పాటు ఎల్వోసీ వద్ద పదేపదే పాక్ కాల్పులు జరుపుతున్నది. ఈ విషయాన్ని భారత్ చాలా సీరియస్‌గా తీసుకుంటున్నది. దీనిపై భారత్ దీటుగా స్పందిస్తుంది. ఈ ఉల్లంఘనలను నిలువరించే సంపూర్ణ అధికారం భారత్‌కు ఉంది. అందుకు సంబంధించి ఆదేశాలు సైన్యానికి అందాయి. ఈ విషయంలో పాక్ బాధ్యతాయుతంగా, సీరియస్‌గా వ్యవహరించాలి. ఉల్లంఘన సరికాదు. ఈ కాల్పులను పాక్ నిలువరిస్తుందని ఆశిస్తున్నా' అని మిస్రీ తెలిపారు.

## లోకం పోకడ




## పాక్ దాడులను తిప్పికొట్టాం

విదేశాంగ కార్యదర్శి మిస్రీ వెల్లడి

న్యూఢిల్లీ, మే 10: పాకిస్థాన్ శనివారం జరిపిన దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టినట్టు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. భారత్-పాక్ ఉద్రిక్తతలపై సైన్యానికి చెందిన కర్నల్ సోఫియా ఖురేషీ, వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. పశ్చిమ ప్రాంతం వెంబడి ఉన్న భారత సైనిక స్థావరాలపై డ్రోన్లు, దూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులు, జెట్లు, ఇతర ఆయుధాలను ఉపయోగించిందని విక్రమ్ మిస్రీ తెలిపారు. అయితే వాటిని భారత్ తిప్పికొట్టిందని చెప్పారు. పంజాబ్, జమ్ము కశ్మీరులోని పౌరులను, పౌరుల మౌలిక సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడులు కొనసాగించినట్లు మిస్రీ చెప్పారు. భారతీయ క్షిపణులు అఫ్ఘానిస్థాన్‌కు తాకాయంటూ పాక్ చేసిన ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. శ్రీనగర్, అవంతిపురా, ఉధంపూర్‌లోని వైద్య సౌకర్యాలపై పాకిస్థాన్ దాడులు చేసిందని కర్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. పంజాబ్‌లోకి హైస్పీడ్ క్షిపణిని పాకిస్థాన్ ప్రయోగించిందని, అయితే పాకిస్థానీ చర్యలకు భారత్ దీటుగా సమాధానం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. పాక్ దాడులకు ప్రతిగా ఆ దేశంలోని మిలిటరీ స్థావరాలు, రాడార్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లపై దాడులు చేసినట్టు వ్యోమికాసింగ్ చెప్పారు.

## రెండు పాక్ జెట్ ఫైటర్లు కూల్చివేత

న్యూఢిల్లీ, మే 10 : పాకిస్థాన్‌కు చెందిన రెండు జెట్ ఫైటర్లను భారత్ కూల్చివేసింది. శ్రీనగర్ ఎయిర్ బేస్ నుంచి ప్రయోగించిన మిసైల్ దాడులతో ఈ జెట్ ఫైటర్లను కూల్చివేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపినట్టు న్యూస్ 18 కథనం వెల్లడించింది. శ్రీనగర్ సమీపంలోని లస్జాన్ వద్ద ఒకటి, ఉత్తర కశ్మీర్‌లో మరొక జెట్ ఫైటర్‌ను కూల్చివేసింది. పాకిస్థాన్ దాడులను తీవ్రతరం చేయడంతో శనివారం భారత్ మొత్తం ఐదు మిస్సైల్‌లతో శ్రీనగర్ నుంచి దాడులు చేసింది. పాకిస్థాన్‌పై ప్రతిదాడులను తీవ్రతరం చేసిన భారత్ శనివారం వేకువజామున ఇస్లామాబాద్, లాహోర్, రావల్పిండి ఎయిర్‌బేస్‌లపై దాడులు చేసినట్టు సంబంధిత వర్గాలు సీఎన్ఎన్‌కు తెలిపినట్టు వెల్లడించింది.

## పాక్‌కు అండగా ఉంటాం: చైనా

ఇస్లామాబాద్, మే 10: పాక్ తన సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను నిలబెట్టుకోవటంలో ఆ దేశానికి అండగా ఉంటామని చైనా ప్రకటించింది. శనివారం చైనా-పాక్ విదేశాంగ మంత్రుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణపై చైనా విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం, భారత్-పాక్ సరిహద్దులో నెలకొన్న పరిస్థితిని పాక్ విదేశాంగ మంత్రి దార్ చైనాకు వివరించారు. దీనిపై వాంగ్ యీ స్పందిస్తూ, 'పాక్-చైనా స్నేహం ఉక్కు కవచం లాంటిది. చైనాకు పాక్ వ్యూహాత్మక భాగస్వామి. ప్రాదేశిక సమగ్రత, స్వతంత్రత, తన సార్వభౌమత్వాన్ని నిలుపుకోవటంలో పాక్‌కు చైనా అండగా నిలుస్తుంది' అని అన్నారు.

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ప్రకటించారు. పాక్ డీజీఎంవో ఫోన్ చేయడంతో తాము అంగీకరించామని చెప్పారు. ఆ తర్వాత కొద్దిసేపటికే విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ సైతం ఈ వార్తను ధ్రువీకరించారు. తర్వాత అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో సైతం ఇదే ప్రకటన చేశారు. దీంతో కాల్పుల విరమణ నిజమేనని తేలిపోయింది. అప్పటిదాకా.. మోదీ వ్యూహాల గురించి, యుద్ధ పాటవాల గురించి సోషల్ మీడియాను హోరెత్తిస్తున్న బీజేపీ శ్రేణులు, వాట్సాప్ యూనివర్సిటీ సైతం ఒక్కసారిగా కంగుతిన్నాయి. ఈ పరిణామాన్ని ఎలా సమర్థించుకోవాలో తెలియక గందరగోళంలో పడ్డాయి. 'ఇదంతా అబద్ధమైతే బాగుండు' అని వాళ్లలో చాలా మంది తప్పక అనుకొని ఉంటారు. ఇక సోషల్ మీడియాలో బీజేపీ మద్దతుదారుల పరిస్థితి చెప్పడం వీలుకాదు. కొందరైతే.. పాకిస్థాన్ ప్రధాని వచ్చి మోదీ కాళ్లపై పడి ప్రాధేయపడుతున్నట్టు ఏఐతో ఫొటోలు సృష్టించి, పాక్ లొంగిపోయిందని ప్రచారం చేసేందుకు ప్రయత్నించారు. కానీ అవి ఫలించవని కొద్ది నిమిషాల్లోనే వారికి అర్థమైంది. ఎందుకంటే.. అసలు కాల్పుల విరమణ ఒప్పందం ఎందుకు జరిగింది? ఆ నిర్ణయం ఎలా తీసుకున్నారు? అనే విషయం ఎవరికీ అంతుబట్టని మిస్టరీగా మారింది. 'అసలు ఎందుకు మొదలు పెట్టినట్టు? ఏం సాధించినట్టు? ఎందుకు ఆపినట్టు? ఇది దేశం పరువుకు భంగకరం కాదా?' అని అనేకమంది అనలిస్టులు సోషల్ మీడియాలో నిలదీయడం మొదలు పెట్టారు. మరి కొంతమంది లాల్‌బహదూర్ శాస్త్రి నేతృత్వంలో భారత సైనికులు 1965లో లాహోర్ వరకు వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ 1971లో 13 రోజుల్లోనే పాక్‌తో యుద్ధాన్ని ముగించి బంగ్లాదేశ్‌ను వేరుచేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ పోస్టులు పెట్టడం మొదలు పెట్టారు. ఆనాడు ఇందిరా గాంధీ చేసిన ప్రసంగాన్ని ట్వీట్ చేయడం మొదలుపెట్టారు. మరికొంత మంది తూటా పేల్చకుండా, కేవలం సరిహద్దుల్లో సైన్యాన్ని నెలల తరబడి మోహరించడం ద్వారానే పాకిస్థాన్‌ను లొంగదీసుకున్న వాజపేయిని గుర్తు చేసుకున్నారు.

# దేశం విస్మయం

### శత్రువు బలహీనంగా ఉన్నా ఎందుకు వదిలేసినట్టు?

శనివారం ఉదయం నుంచే కొన్ని ఆశ్చర్యకర పరిణామాలు తెరమీదికి రావడం కనిపించింది. శుక్రవారం రాత్రి పాక్ వైమానిక స్థావరాలను భారీ ఎత్తున ధ్వంసం చేశామంటూ మొదటిసారి అధికారికంగా కొన్ని ఫొటోలు విడుదలయ్యాయి. మొదటిసారి జరిపిన దాడిలో ఏయే తీవ్రవాదులను తుదముట్టించారన్న వివరాలు పేర్లతో సహా నాలుగురోజుల తర్వాత శనివారమే బయటికి వచ్చాయి. మొత్తమ్మీద యుద్ధంలో పాకిస్థాన్‌పై మనం తిరుగులేని విజయం సాధిస్తున్నట్టు రుజువైంది. సైన్యం వీరోచితంగా పోరాడుతూ.. పాకిస్థాన్‌పై పైచేయి సాధిస్తున్న క్రమంలో మోదీ ప్రభుత్వం ఇలా ఎందుకు చేసిందన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు. 'నిజానికి పాకిస్థాన్ ఇప్పుడు చరిత్రలోనే ఎన్నడూ లేనంత బలహీనంగా ఉన్నది. దాని దగ్గర సరైన ఆయుధ సంపత్తి లేదు, ఆర్థిక బలమూ లేదు. అటు అఫ్ఘానిస్థాన్ సరిహద్దులో సమస్యలు ఎదుర్కొంటున్నది. ఇటు బలూచిస్తాన్‌లో సమస్యలు ఎదుర్కొంటున్నది. టర్కీ మినహా ఇతర ముస్లిం దేశాలు పెద్దగా సహకరించే పరిస్థితి కూడా లేదు. అమెరికా-చైనా మధ్య ట్రేడ్ వార్ నేపథ్యంలో జియోపొలిటికల్ వాతావరణం కూడా పాక్‌ను లొంగదీసుకోవడానికి, మనం పైచేయి సాధించడానికి పూర్తి అనుకూలంగా ఉన్నది. అంతేకాకుండా ఇప్పుడు భారత సైన్యం అప్రతిహత విజయాలు సాధిస్తున్నది. పాకిస్థాన్‌కు సంబంధించిన ఒక్క క్షిపణి కూడా భారత్‌లోకి రాకుండా సైన్యం దుర్గం లాగా నిలబడింది. ఆర్మీ వీరోచిత పోరాటానికి దేశం మొత్తం జేజేలు పలుకుతున్నది. మొదటి దాడిలోనే ఉగ్రవాదులను మట్టుబెట్టింది, రెండో దాడిలో పాక్ సైనిక స్థావరాలపై దాడులు చేసింది. పాక్ దాడులకు వాడిన డ్రోన్లను ఎక్కడికక్కడి కూల్చిపారేసి, తన దుర్భేద్యమైన సైనికశక్తిని చాటుకున్నది. ఇలాంటి సమయంలో మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నదనేది మిస్టరీగా మారింది.



జమ్ముకశ్మీర్‌లోని నౌషేరాలో ఎల్‌వోసీ వెంట భద్రతా దళాలు గుర్తించిన టర్కిష్ డ్రోన్

'సైనిక బలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి ఉంటే వాళ్లు పాకిస్థాన్‌ను లొంగదీసుకొనేవారు, మోదీ ప్రభుత్వం అలా చేయకపోవడం చారిత్రక తప్పిదం' అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. పాక్ నుంచి బలూచిస్థాన్‌ను విడగొట్టడానికి ఇంతకుమించిన సమయం మరొకటి లేదు. పీవోకేను స్వాధీనం చేసుకోవడానికి కూడా ఇదే అనువైన సమయం. పాకిస్థాన్ అనే పీడను వదిలించుకోవాలని ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. దానికి శాశ్వతంగా గుణపాఠం చెప్పాలని భావించారు. ఇందుకోసం ఎదురయ్యే కష్టనష్టాలను ఎదుర్కోవడానికి కూడా ప్రజలు సిద్ధమై ఉన్నారు. అందుకే దేశంలోని ప్రతి రాజకీయ పక్షం మోదీ ప్రభుత్వం వెంట నడిచింది. మీరు యుద్ధం చేయండి, అన్ని రకాలుగా మద్దతు ఇస్తామని చెప్పాయి. త్రివిధ దళాలు పాక్ మీద ఎప్పుడెప్పుడు ప్రతీకారం తీర్చుకుందామా అని ఎదురుచూస్తున్నాయి. పాక్ దాడులను సమర్థంగా తిప్పికొడుతూనే.. ప్రతిదాడులతో తమ సత్తా చాటాయి. మూడు రోజుల్లోనే పాక్‌ను ఆత్మరక్షణలోకి నెట్టాయి. ఇంత అనువైన సమయం ఉండగా మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించిందన్నది అంతుపట్టడం లేదు.

### సాధించిందేంది?

**'పాకిస్థాన్‌పై** దాడికి ముందు బీజేపీ శ్రేణులు, మోదీ భక్తులు సోషల్ మీడియాలో, వాట్సాప్ యూనివర్సిటీలో చేసిన ప్రచారం అంతాఇంతా కాదు. ఈసారి పాకిస్థాన్‌పై దాడి అంటూ జరిగితే.. బలూచిస్తాన్‌ను విడగొట్టడం ఖాయం! పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మనం గుంజుకోవడం ఖాయం! పాకిస్థాన్ ముక్కలు చెక్కలు కావడం ఖాయం!' అని ప్రచారం చేశారు. మరి ఇప్పుడు కనీసం పాకిస్థాన్ ఒక లొంగుబాటు ప్రకటనగానీ, శరణు వేడిన దాఖలాగానీ, కనీసం యుద్ధం వద్దని ప్రాధేయపడిన ఆనవాలుగానీ లేదు. అయినా కాల్పుల విరమణకు బీజేపీ ప్రభుత్వం ఎట్లా అంగీకరించిదని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నలు సంధించడం మొదలుపెట్టారు. 'పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఏం జవాబు చెప్తుంది? అసలు దీనిని ఎందుకు మొదలు పెట్టినట్టు? ఎందుకు ఆపినట్టు?' అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ముఖ్యనేత కేసీ వేణుగోపాల్ అయితే 'వియ్ మిస్ ఇందిర' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరో సీనియర్ నేత జైరాం రమేశ్.. కాల్పుల విమరణకు మోదీ ప్రభుత్వం ఎందుకు అంగీకరించిందో పార్లమెంట్ సమావేశం పెట్టి, అఖిలపక్ష సమావేశం నిర్వహించి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్వగురుగా ప్రకటించుకున్న మోదీ అమెరికా చెప్తే కాల్పుల విరమణకు ఎలా అంగీకరిస్తారని మరో సీనియర్ నాయకుడు నిలదీశారు. అసలు మనదేశం ఏం చేయాలో, ఏం చేయొద్దో చెప్పడానికి అమెరికా ఎవరనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఇంతలోనే ఐఎంఎఫ్ పాకిస్థాన్‌కు రూ.8 వేల కోట్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ ప్రకటించినట్టు వార్తలు వచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇంత ప్రభావం ఉన్న మోదీ.. కేవలం 26 సభ్యదేశాలుగా ఉన్న ఐఎంఎఫ్‌ను పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకుండా ఎందుకు అడ్డుకోలేకపోయారన్న అనుమానాలు అప్పుడే తలెత్తాయి. ఐఎంఎఫ్‌లో భారత్ కూడా సభ్య దేశమే. ఇంతలోనే అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ప్రకటన వెలువడటం, దేశానికి విస్మయం కలిగించింది.

### విరమణ ఒప్పందంపై ప్రశ్నలెన్నో!

విచిత్రం ఏమిటంటే కాల్పుల విరమణకు అంగీకరించినట్టు భారత్ నుంచి విస్పష్టమైన ప్రకటన రాగా.. పాకిస్థాన్ వైపు నుంచి మాత్రం కాల్పుల విరమణకు ఒప్పించినందుకు ట్రంప్‌కు పాక్ ప్రధాని, ఉప ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. 'ఈ వ్యవహారం చూస్తుంటే పాకిస్థాన్‌కు అనుకూలంగా అమెరికా చక్రం తిప్పింది. ఆ ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయినట్టు అనిపిస్తున్నది' అనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమయ్యాయి. వాస్తవానికి యుద్ధాన్ని ఎవరూ కోరుకోరు. కానీ.. ఒకవేళ యుద్ధం మొదలు పెడితే విజయం కోసమే కృషి చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు త్రివిధ దళాలకు స్వేచ్ఛ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ.. ఇప్పుడు మనకు చెప్పుకోదగ్గ విజయం కండ్లముందు కనిపించడం లేదు. పహల్గాం ఉగ్రదాడికి కారకులైనవారిని పాకిస్థాన్ మనకు అప్పగించిందా అంటే అదీ లేదు. ఉగ్రవాద సంస్థలను మూసేస్తామని ప్రకటించిందా అంటే అదీ జరగలేదు. మసూద్ అజర్ వంటి ఉగ్రవాదులు బహిరంగంగా తిరుగుతున్నా.. తమ దేశంలో ఉన్నారని పాక్ ఒప్పుకున్నదా? అంటే ఒప్పుకోలేదు. పాకిస్థాన్ నుంచి ఎలాంటి కమిట్మెంట్ రాకుండా కాల్పుల విరమణ ఎందుకు ఒప్పుకున్నట్టు? ఇలాంటి అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఒకవేళ బీజేపీ సోషల్‌మీడియా ప్రచారం చేస్తున్నట్టు భారత్ షరతులకు పాక్ తలొగ్గి ఉంటే.. వాటిని దేశ ప్రజల ముందు పెట్టాలి కదా? అని విపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

### విరమణను సమర్థించుకోలేక తంటాలు

మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని ప్రకటించిన తర్వాత కూడా సరిహద్దు వెంబడి పాకిస్థాన్ యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడింది. గత మూడు రోజుల్లో ఎన్నడూ లేనంత సంఖ్యలో డ్రోన్ల దండు ఐదు రాష్ట్రాల మీదికి దూసుకొచ్చాయి. ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, ఇండియా టీవీ, ఎన్డీటీవీ తదితర అనేక టీవీ చానళ్లు ఇందుకు సంబంధించిన విజువల్స్‌ను కూడా చూపించాయి. ఒక డ్రోన్ ఏకంగా శ్రీనగర్‌లోని రాజ్‌బాగ్ వరకు, మరో డ్రోన్ గుజరాత్‌లోని కచ్ వరకు దూసుకొచ్చినట్టు వార్తలు వచ్చాయి. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్వయంగా శ్రీనగర్‌లో కాల్పులు, పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయని.. ఇక కాల్పుల విరమణ ఒప్పందం ఎక్కడిదని ప్రశ్నించారు. అయినా కూడా మోదీ ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేదు. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన జరగలేదని చెప్పుకోవడానికి మోదీ ప్రభుత్వం నానాతంటాలు పడింది. అయితే అనేక టీవీ చానళ్లు విజువల్స్‌తో సహా డ్రోన్ల వీడియోలు చూపిస్తుండటంతో.. ఒప్పందం ఉల్లంఘన జరిగిందని ఒప్పుకోక తప్పలేదు. మధ్యాహ్నం 5 గంటల నుంచి అమల్లోకి వచ్చిన ఒప్పందాన్ని.. గంటలు గడవకముందే పాకిస్థాన్ ఉల్లంఘించింది. కానీ.. ఉల్లంఘనల్ని ప్రతిఘటించాలని సైన్యాన్ని ఆదేశించామని చెప్పడం తప్ప, కాల్పుల విరమణ ఒప్పందం అమలు, భవిష్యత్తు కార్యాచరణపై మాత్రం మోదీ ప్రభుత్వం చెప్పలేదు. మరోవైపు పాకిస్థాన్.. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన వెంటనే ఆ విషయాన్ని చైనాకు చెప్పింది. చైనా ప్రభుత్వం ఏదేమైనా.. ఎటువంటి పరిస్థితుల్లో అయినా తమ మద్దతు పాకిస్థాన్‌కే ఉంటుందని ప్రకటించింది. మొత్తంగా మోదీ ప్రభుత్వం తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నదని, అనుమానాస్పదంగా ఉన్నదని, అది ఇలా ఎందుకు చేసిందో అంతుబట్టడం లేదని నెటిజన్లు, రాజకీయ విశ్లేషకులు, రక్షణ రంగ నిపుణులు, టీవీ చర్చల్లో పాల్గొన్నవారు తలలు పట్టుకుంటున్నారు. నిన్నటివరకు ఇది మా యుద్ధం కాదు.. మాకు సంబంధం లేదు అని చెప్పిన అమెరికా ఎందుకు జోక్యం చేసుకున్నది. 'దేశ సరిహద్దు రక్షణ విషయంలో, దేశ ప్రయోజనాల విషయంలో ఎవరినీ లెక్కబెట్టే సమస్యే లేదు, ఎవరి మాటా వినాల్సిన అవసరం లేదు' అని గొప్పలు పోయిన బీజేపీ, మోదీ ఎందుకు అమెరికా చెప్పిన మరుక్షణమే కాల్పుల విరమణకు ఒప్పుకున్నది అనేది అంతుచిక్కని ప్రశ్నలుగా మిగిలిపోయాయి.